


# దేవపారిజాతం

కె.ఆర్.కె.మోహన్

"పక్కింట్లోకి ఎవరో అద్దెకి వచ్చినట్లున్నారే!" అన్నాడు రాజా.

"అవునురా...నువ్వు ఆఫీసుకు వెళ్ళాక వచ్చారు. ఈ ప్రొద్దునే దిగారు" అంది నర్సమ్మ.

"పోన్లే. ఇప్పటికైనా ఎవరో ఒకళ్ళు వచ్చారు. ఆర్నెల్లు పై నుంచీ ఆ భాగం ఖాళీగానే ఉంది. అటువంటి ఇంట్లోకి అద్దెకి వచ్చారంటే వాళ్ళెంతటి నిర్భాగ్యులో!"

"అవునురా. వాళ్ళెవరో ఏమిటో చూద్దామని భోజనం చేశాక ఓసారి అలా వెళ్ళి వచ్చాను. పాపం... వాళ్ళని చూస్తేనే కడుపు తరుక్కుపోయింది..."

"అదేం?"

"ఏం చెప్పమంటావు! వాళ్ళు ఏమీలేని వాళ్ళు. పిట్టని కొట్టా పొయిలో పెట్టా అన్నట్టు ఏపూట తిండి ఆ పూట వెతుక్కోవలసిందే."

"అదేమిటి? మరి వాళ్ళ ఇంటాయన ఏమి చేస్తాడు?"

"ఇంటాయనా...పాడా...అటువంటి శాల్తీ ఏమీ ఉన్నట్టు లేదు. ఆవిడని చూస్తే నిత్య సువాసినిలా అనిపిస్తోంది. మూసివాయనం ముత్తయిదువులా మెళ్ళో పసు పుతాడు, చేతికి మట్టి గాజులూను."

"పేదవాళ్ళకి అంతకంటే ఏముంటుందిలే. నిత్య సువాసిని అన్నావు. అదేమిటి?"

"అంటే భర్త వదిలేసిన బాపతన్నమాట. అయివులేకుండా పోయిన మొగుడు వచ్చేదీ లేదు, చచ్చిందీ తెలీదు. అందుకనే అటువంటి వాళ్ళ భార్యలు నిత్యమూ పసుపు తాడునో, మంగళ సూత్రాన్నో తీయకుండా బొట్టు చెరువు కోకుండా బ్రతికినన్నాళ్ళూ గడుపుతారు. అందుకే వారిని నిత్య సువాసినులు అంటారు. అటువంటి పేదవాళ్ళే సాధారణంగా మూసివాయనాలకు వస్తుంటారు."

"అఘోరించినట్లుంది. కష్టాలలో వున్నవాళ్ళని చూసి జాలిపడాలికాని పేర్లుపెట్టి నవ్వుకోవడం ఏం బాగుంటుంది?"

"అదేమిటిరోయ్...నేనేదో **సొంతంగా పేరుపెట్టి** ఎగతాళి చేసినట్లు మాట్లాడుతు న్నావు? నలుగురూ అనేమాటనే నేనూ అన్నాను"

"పోన్లేకాని అలా ఎందుకనిపించింది?"

"మీవారేం చేస్తుంటారు అని అడిగిన దానికి సరిగ్గా సమాధానం చెప్పలేదు. ఏదో దేశంకాని దేశంలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడట. అదేమి ఉద్యోగమో కూడా తెలీదట. ఎప్పుడో వస్తాడట. వచ్చీ వచ్చినట్లుగానే పోతాడట. ఆవిడ చెప్పిన మాటలు వేటికీ పొంతన లేదు. ఆ తర్వాత ఇంటావిడ చెప్పింది మొగుడు కూతురు పుట్టిన కొద్ది రోజులకే వదిలేశాడుట."

"ఊ...పాపం. మరయితే వాళ్ళకి గడవడం ఎట్లా?"

"వంటలు చేయడానికి వెళ్తుంటుంది. ఊరగాయల రోజుల్లో పసుపులు కారాలూ కొట్టుంటుంది. మూసివాయినాలకి వెళ్తుంటుంది."

"మూసివాయినాలంటే?"

"ఎవరైనా పుణ్య స్త్రీ చనిపోతే కర్మలు అయిపోయాక చేటలో పసుపు కుంకం రవికల గుడ్డ పెట్టి ముత్తయిదువులకు వాయనం ఇస్తారు. ఇటువంటి వాయ

## బొమ్మా–బొరుసు



నీకేమీ తెలుసురా మా గుండె మంట
మూడు పూటలు మె క్కుతుంటావు గదరా
అద్దాల మేడలో నిద్దరంపు పరుపుపై
చేస్తావురా నీవు మంతనాలెన్నెన్నో
సలహాలు ఇస్తావు నీవారికందరికీ
కాసులను తెచ్చుటే పరమార్థమంటావు
ప్రేమ ప్రేమంటావు ప్రేమ నటియిస్తావు
నీమాట కడ్డొస్తే నరికి పారేస్తావు
పేద, బిక్కీ అనక నీ మాట నీదెరా
గంజి నీళ్ళకు మాకు కరువొచ్చి పోయెరా
మా మాట రవ్వంత వినకుంటేవేమిరా,
మూడు పువ్వులు ఆరుకాయలై వెలిగేవు
కాలమంతానీకు అనుకూలమనుకోకు
ఏదో ఒక నాటికి బొమ్మబొరుసై పోవు
నీ జన్మ తగలెయ్య, కానిపనులిక మాను
మంచికే కాలముంటుందని తెలుసుకో
మృగరాజు కెటువంటి అవధులే లేవని
వనమంత తనదనుచు మదిని విర్రవీగె
తెలియక ఒకరోజు ఉచ్చులో పడిపోయె
చిన్నదనుకొన్న చిట్టెలుకనే సాయమడిగె
రాజెవడో? పేదెవడో? లెక్కలు తారుమారైనప్పుడు

– డా. ఎన్.అప్పన్న

వాలు తీసుకునే వారిని మూసివాయనం ముత్తయిదువలంటారు. ఇటువంటి వాయనాలను అందరు ముత్తయిదువులకు ఇయ్యరు. అందరూ తీసుకోరు కూడా. కేవలం ఏమీలేని కటిక పేదవాళ్ళు మాత్రమే తీసుకుంటారు. ఈ మూసివాయనం ముత్తయిదువులని పండగలకీ పబ్బాలకీ పేరంటాలకీ ముత్తయిదువులుగా పిలవరు."

"ఎంత దారుణం! ముత్తయిదువులలో కూడా మళ్ళీ తేడాలా?"

"అది అంతే...అది సాంప్రదాయం ఏనాటి నుంచో వస్తోంది. నువ్వూ నేనూ మార్చాలంటే మార్చగలమా ఏమిటి?"

"అయినా మిల్లులూ, గ్రైండర్లూ వచ్చిన ఈ రోజుల్లో కారాలూ పసుపులూ కొట్టించుకునే వాళ్ళెవరమ్మా?"

"ఆమాట నిజమే. పాతకాలం వాళ్ళు ఆచారానికి పనికిరాదనీ, మిల్లులో వేస్తే అవీ ఇవీ కలిసిపోతాయని పంపరు. గ్రైండర్ వున్నవాళ్ళలో చాలా మందికి గ్రైండర్లో వేసే కారాలూ, అవపిండీ, ఊరగాయ... కావలసిన విధంగా మెత్తగా ఉండవని ఒక నమ్మకం. అటువంటి వాళ్ళే రోళ్ళలో దంపించుకుంటారు."

"ఈ రోజుల్లో ఇటువంటి వాళ్ళు బాగా తక్కువ. ఉన్నారనుకున్నా ఏదో ఊరగాయ రోజుల్లో పదిళ్ళలో పనిరావచ్చు. దాంతో ఏటికి ఏడాదీ ఎలా గడుస్తుంది?"

"నిజమేరా...అందుకేరా వాళ్ళని చూస్తే కడుపు తరుక్కుపోతోంది అన్నది. ఎంతైనా బతికిచెడ్డ బాపనాళ్ళు. అంట్లు తోమడం, బట్టలుతకడం వంటి అలగా పనులు చేయలేరు. పాపం ఏ జన్మలో చేసుకున్న పాపమో వాళ్ళది!"

"అది సరే...వాళ్ళ అమ్మాయి కూడా ఉన్నట్లుంది? ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదూ?"

"ఏం చెప్పమంటావురా నాయనా! వయసొచ్చిన పిల్ల . బంగారు బొమ్మలా ఉంటుంది. కాని ఏం ప్రయోజనం! పాపం...గుడ్డిది. రెండు కళ్ళూ లేవు. అసలే పేదవాళ్ళు. దానికితోడు గుడ్డి. ఇంక ఆ పిల్లకి పెళ్ళేమి అవుతుంది?"

"రామ...రామ...నువ్వన్నట్లు నిజంగా వాళ్ళు ఏ జన్మలోనో చేసుకున్న పాపమే అనుకోవాలి. ఇంతకీ ఆ పిల్ల పుట్టు గుడ్డా? మధ్యలో వచ్చిందా?"

"ఏమో...ఆ వివరాలేవీ తెలియదు. ఈ రోజేగా మాట్లాడింది"

"చాలా దారుణంగా ఉందమ్మా...వాళ్ళ సంగతి వింటుంటే కడుపులో దేవినట్లుగా ఉంది..." అంటూ కంచంలో చేయి కడుక్కుని లేచాడు రాజా.

"ఒరేయి...అన్నం తినకుండా లేచేశావేమిటిరా? లోకంలో ఇటువంటి సంసారాలు ఎన్నో ఉన్నాయి. ఇంతకన్నా ఘోరమైనవీ ఉన్నాయి. మనం ఏమి చేయగలం? అయ్యో అనుకోడం తప్ప. వీటికి మనసు పాడుచేసుకుని అన్నం వదిలేస్తే ఎలారా? ఆ దేవుడు కరుణించి వాళ్ళని చల్లగా చూడాలికాని..."

రాజా ఏమీ మాట్లాడకుండా తుండుకి చెయ్యి తుడుచుకుని సావిట్లోకి వెళ్ళిపోయాడు.

రాజా ఇంటిపక్కనే రామనాథ శాస్త్రిగారి ఇల్లు. ఆయన వేదం బాగా చదువుకున్నవాడు. పౌరోహిత్యం చేసేవాడు. పిత్రార్జితంగా వచ్చిన ఒక చిన్న పెంకుటిల్లు, ఒక ఎకరం పొలం ఉన్నాయి. వెనుకటి రోజుల్లో పెళ్ళిళ్ళవంటి శుభకార్యాలూ, శ్రాద్ధ కర్మలు కూడా శ్రద్ధగా భక్తితో పెట్టేవారు కాబట్టి ఆయన్ని గౌరవంగా పిలిచి తగువిధంగా సత్కరించేవారు. పొలం మీద ఓ పది బస్తాల గింజలు వచ్చేవి. దానాలుగా వచ్చిన గోవులు రెండు ఉండేవి. ఇంటి పెరట్లో కాయకూరలు పండించుకునేవారు. వీటన్నిటితో సంసారం ఏ చీకూచింతా లేకుండా సాఫీగా సాగిపోతుండేది. పైగా అంతో ఇంతో మిగులుతుండేది. కాలంలో వస్తున్న మార్పును గమనించిన శాస్త్రిగారు తన పిల్లలు తనలాగే పౌరోహిత్యం చేయాలని అనుకోలేదు. అందుకే వాళ్ళకి మంచి చదువులూ చెప్పించాడు. దానికితోడు వాళ్ళు మంచి తెలివితేటలున్నవారు కావడంతో స్కాలర్‌షిప్‌లు కూడా వస్తుండేవి. నోటి మంచితనంతో వారినీ వీరినీ అడిగి సహాయం పొందాడు. వీటన్నిటివల్లా ఆయన కొడుకులు నలుగురు పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగాలు సంపాదించుకోగలిగారు. నలుగురూ బొంబాయి, ఢిల్లీ వంటి పెద్ద నగరాలలో సెటిల్ అయ్యారు. అయితే వాళ్ళెవరికీ తాము పౌరోహిత్యం బ్రాహ్మడి పిల్లలమని చెప్పకోవడం ఇష్టం లేదు. అందుకే వాళ్ళు సొంత ఊరికి కూడా రారు. తప్పనిసరిగా ఎప్పుడైనా రావలసి వచ్చినా ఓపూట, ఓ రోజు ముక్కు పట్టుకు కూర్చుని వెళ్ళిపోయేవారు. పోనీ పెద్ద వాళ్ళయి పోయారుకదా అని తల్లిని తండ్రిని తమతో తీసుకు వెళ్తారా అంటే అదీ లేదు. పొరపాటున వాళ్ళంతట వాళ్ళే వస్తామని అంటారేమోనన్న భయంతో ముందుగానే "ఆ ఊళ్ళలో మీరు ఉండలేరమ్మా...మేము ఎప్పుడో పోయి ఎప్పుడో వస్తాం. ఊరుకాని ఊరిలో భాషరాని చోట మీకు ఏం తోస్తుంది? రెండు రోజులు కూడా ఉండలేరు. అయినా మీరు వస్తే ఇక్కడ ఈ ఇంటిని ఆ పొలాన్ని ఎవరు చూస్తారు?" అంటూ ముందు కాళ్ళకి బంధాలు వేసేవారు. వాళ్ళు ఏ ఉద్దేశంతో అన్నా వాళ్ళు అన్న మాటల్లో వాస్తవం ఉంది. సుగుణమేమిటంటే రామనాథశాస్త్రిగారికి ఆడపిల్లలు లేరు. అందువల్ల వాళ్ళకు పెళ్ళిళ్ళు చేసే ప్రయాస ఆ తర్వాత అల్లుళ్ళవల్ల వచ్చే అవమానాలూ లేకుండా పోయాయి. ఈ పరిస్థితుల్లో రామనాథశాస్త్రిగారు, సుబ్బాయమ్మగారూ, రామకృష్ణా అనుకుంటూ వయసుడిగిన చిలకా గోరింకల్లా కాపురం చేస్తున్నారు.

వయసు శాస్త్రి దంపతుల ఆరోగ్యాలపై దెబ్బతీసి దేహాన్ని శిథిలం చేస్తుంటే కాలం ఆయన ఇంటిని శిథిలం చేస్తోంది. మనిషికే వంటికేకాదు ఇంటికి కూడా పోషణ ఉండాలి. అప్పుడే అదీ బాగుంటుంది. పెంకుటిల్లు బాగా పాతదైపోయింది. చాలాచోట్ల పెంకులు లేచిపోయాయి. వెదురు చీలిపోయింది. పెద్ద పెద్ద చిల్లులు ఏర్పడ్డాయి. వాటిలోంచి సూర్యకిరణాలు సూటిగా ఇంట్లోకి వస్తాయి. అయినా బాధ లేదు. కాని వర్షాకాలంలో మాత్రం ప్రాణాంతకంగా ఉంటుంది. ఇల్లంతా ధారగా వర్షం కురుస్తూంది. వర్షం కురిసే చోట బకెట్లు, గిన్నెలు పెట్టుకోవడం, అవి నిండగానే బయట పారపోసి మళ్ళీ పెడ్తుండడం–ఇదంతా ఒక యజ్ఞం. ఇంతచేసినా నేలంతా తడిసిపోతుండేది. బట్టలూ తడుస్తుండేవి. వర్షం తగ్గాక నేల అంతా గుడ్డపెట్టి తుడవడం, తడిసిన బట్టల్ని ఆరవేయడం మరో యాగం.


వర్షాకాలంలో తడిబట్టలు త్వరగా ఎండి చావవు. చచ్చిపోయిన పందికొక్కులాగా దిక్కుమాలిన ముక్క కంపు కొడ్తుంటాయి. ఇంత ప్రయాసపడడానికి ఆ ముసలి దంపతులకి ఓపిక లేదు. ఇల్లు బాగు చేయించుకునే శక్తి వాళ్ళకి లేదు. పరిస్థితిని వివరిస్తూ ఇంటిని బాగు చేయించవలసిందిగా నలుగరు కొడుకులకీ ఉత్తరాలు రాశాడు రామనాథశాస్త్రిగారు. కూడబలుక్కున్నట్ట నలుగురూ ఒకేవిధమైన సమాధానం రాశారు. "ఆ ఇంటిని బాగు చేయించడం దండగ. వచ్చిన కాడికి అమ్మివేయండి" అని. అంతవరకు బాగానే ఉంది. అమ్మిన తర్వాత ఏం చేయాలి? ఎక్కడుండాలి? ఆ వచ్చే డబ్బుతో కొత్త ఇల్లు కొనుక్కోవడంకాని కట్టుకోవడం కాని అసాధ్యం. పోనీ ఆ డబ్బు ఏ బ్యాంకులోనో వేసుకుని ఆ వడ్డీ డబ్బు తీసుకుందామా అంటే ఆ వడ్డీ మొత్తానికి ఏ అద్దె ఇల్లూ దొరకదు. ఇవన్నీ వాళ్ళకి తెలియనా అంటే తెలుసు. తెలియనట్లుండే గడుసుదనం. పోనీ మాటవరసకైనా, మర్యాదకోసంగానైనా "ఇల్లు అమ్మేసి మీరు మా దగ్గరికి వచ్చేయండి" అని పొరపాటుగానైనా ఎవరూ రాయలేదు. వస్తే కామారవు జీడిలాగా కరుచుకుపోతారని భయం. ఈ పరిస్థితులలో గత్యంతరం లేక ఆ ఇంటిలోనే వెళ్ళమారుస్తున్నారు.

పరిస్థితులు వికటించినవుడు అన్నీ అలాగే ఉంటాయి. శాస్త్రిగారి పిల్లలు ఎక్కడో బొంబాయి, ఢిల్లీల వంటి దూరాల్లో ఉండడం వాళ్ళేమీ పట్టించుకోకపోవడం, అసలు ఊరికి కూడా రాకపోవడం శాస్త్రి దంపతులు వృద్ధులు కావడం గమనించేసరికి బ్రహ్మకైనా పుట్టు రిమ్మ తెగులు అన్నట్లు బహుకాలంగా నిజాయితీగా పొలుకి పది బస్తాల ధాన్యం ఇస్తున్న కౌలు రైతు కూడా తోక ఝాడించడం మొదలు పెట్టాడు. అనావృష్టి అని ఓసారి, అతివృష్టని మరోసారి, తుఫాను అని ఇంకోసారి చీడపట్టిందని వేరేసారి ఇలా చెప్పిన సాకు చెప్పకుండా ఇచ్చే ధాన్యంలో కోత పెట్టేయడం మొదలుపెట్టాడు. అటుతిరిగి ఇటుతిరిగి నాలుగైదు బస్తాలు మించి ఇయ్యడం మానేశాడు. వాడితో తగాదా పడే శక్తిలేదు శాస్త్రిగారికి. మంచి ఉద్యోగాలలో వేలకువేలు సంపాదిస్తున్న పిల్లలు నెలకో పది రూపాయలు కూడా పంపడం లేదు. సొంత బిడ్డలే అలా ఉన్నప్పుడు పరాయివాడు ప్రేమ చూపిస్తాడా? కనీసం వీడు ఓ నాలుగు బస్తాలైనా ఇస్తున్నాడు. అదీ లేదంటే చేసేదేముంది? 'దున్నే వానిదే భూమి' అన్న సిద్ధాంతం ప్రకారం ఈ పొలం వాడే అంటే చెప్పగలిగిందేమి ఉంది! ఆ నాలుగు బస్తాలే మహద్భాగ్యంగా భావించుకోసాగాడు శాస్త్రిగారు.

ఈ రోజుల్లో తద్దినాలు పెట్టేవారు కూడా బాగా తగ్గిపోయారు. ఎవరికీ తీరిక ఉండడం లేదు. కోరికా ఉండడం లేదు. ఓపిక అంతంత మాత్రం. అందువల్ల షార్ట్‌కట్‌గా ఏ రాఘవేంద్రస్వామి మఠంలోనో ఓ యాభై రూపాయలిచ్చేసి, టైం ప్రకారం అయిందనిపించుకుని తప్పనిసరి తద్దినం పెట్టేస్తున్నారు. ఈ మార్పు మూలంగా శాస్త్రిగారిని శ్రాద్ధకర్మలకు పిలిచేవారి సంఖ్య బాగా తగ్గిపోయింది. పెళ్ళిళ్ళు సరేసరి. ఏడాది మొత్తంమీద ఏడు పెళ్ళిళ్ళు వస్తే ఘనం. ఈ పరిస్థితులలో బ్రతుకు వెళ్ళమార్చడానికి కటకటలాడిపోతున్నాడు. దొడ్లో కాయగూరలు పండించే ఓపిక లేదు. కనీసం గడ్డి పీకే శక్తి లేదు. కూలివాడిని పెట్టి పని చేయించే స్థోమత అసలే లేదు. దాంతో దొడ్డంతా గడ్డిపెరిగి గీజురుమంటూ పాములు తిరిగేటట్లుగా తయారయింది. ఇంట్లో వసారాలో కొంత భాగం కూలిపోయింది. దాంతో గత్యంతరం లేక ఆ వసారాని, దానిని అంటివున్న ఒక గదిని అద్దెకిస్తామని బోర్డు పెట్టారు. ఆ గది కూడా అంతంత మాత్రమే. బోర్డుపెట్టి ఆరు నెలలు దాటినా అద్దెకి వచ్చే వాళ్ళు ఎవరూ కనీసం లోనికి వచ్చి చూడను కూడా చూడలేదు. ఇంటి సంగతి బయట నుంచే తెలుస్తుంటే లోపలకి వచ్చి ఎవరు చూస్తారు?

అటువంటి ఇంటిలోకి ఇద్దరు అద్దెకువచ్చారు. పార్వతమ్మా ఆవిడ కూతురు సీత. వాళ్ళ పేర్లు కూడా వారికి సరిపోయినట్లే ఉన్నాయి. పార్వతీదేవి నిత్య దరిద్రుడైన శంకరుని భార్య. తనకి లేకపోయినా ఇతరులకి మాత్రం వరాలు ఇయ్యగలదు. కాని ఈ పార్వతమ్మ తనకి ఎటూ లేదు. ఇతరులకి మాత్రం కూలి తీసుకుని వంటలు చేసి ఇయ్యగలదు. ఇంక సీత సంగతి. సీత అని పేరున్న వారందరూ కష్టాలు పడ్డారుట. అందుకే సీతమ్మ కష్టాలు అని అంటారు. సీత లాంటి వారిని చూస్తే ఈ లోకోక్తి నిజమేనేమో అనిపిస్తుంది. అయితే ఆ సీత కష్టాలు పెళ్ళి అయ్యాక మొదలయ్యాయి. కాని ఈ సీత మాత్రం పెళ్ళి కాకుండానే ఇంకా చెప్పాలంటే పుట్టినప్పటి నుంచీ అష్టకష్టాలు పడుతూనే ఉంది.

## ఆమని – కోయిల



వెండి వెన్నెల చల్లదనాన
హంసల్ని ఆర నిచ్చావు
ఏడు రంగుల తెల్లదనాన
కొక్కరాయిని ముంచితీసావు
ఏర్చి కూర్చిన రంగులన్నీ
నెమలి కన్నుల నత్తావు
పైరంటి పచ్చదనం గిళిమేనుకిచ్చావు
రంగంచుల నీలి చీరల్ని
పాల పిట్టకు చుట్టబెట్టావు
పొగచూరున – ఏలనోమరి?
నిలువెల్ల నన్నద్ది వదిలావు.

ఓ బంగరు రంగుల కుంచెను
జీవమాడిన విహంగాలు
నామోము జూచి
వికసక్కెమాడాయని –
చెట్లు చిగిర్చేదాకా
ధాగిపోయాను.
పట్టి చిగుళ్ళతోనే
కడుపు నింపాను.
తోడుకు పులుగే లేక
ఒంటరినైనాను.

ఆమని వచ్చేసరికి
నా చీకటి రెక్కలనంటిన
శిశిరాన్ని విదిల్చి
వసంతమంతా పులుముకుని
ఋతువంతా నేనైపోవాలని
నీ ఇచ్చిన గొంతు
నే విచ్చేసరికి
ప్రకృతి వీనుల అమృతం కురిసింది.
వెల వెలబోయిన విహంగాల
గొంతులు జీరాడుతుంటే
నే సంగీత సామ్రాజ్ఞినయ్యాను.
నా స్వరాల అనుస్వరాల
సుధారసాల జగత్తును
పరవశింప జేస్తూ
నా గొంతు నీవే అయినందుకు
ఆమని – కోయిలనై.

– నారాయణమూర్తి తాతా

రామనాథశాస్త్రి దంపతులకు అద్దె మీద వచ్చే ఆ పది రూపాయలవల్ల కలిసి వచ్చేది ఏమీ లేదు. అది పోవు దినుసులకు కూడా చాలదు. కాకపోతే వారికి ఈ వయసులో తోడు అవసరం. ఏ నిముషానికి ఎవరికి ఎలా ఉంటుందో తెలియదు. ఓపూట లేవలేకపోతే కనీసం కాసిని గంజిలు ఉడకేసి పెట్టేవాళ్ళేనా ఉండాలి. అందుకే తమకి ఆసరాగా ఉండేటట్లు పార్వతమ్మకి అద్దెకి ఇచ్చారు.

గుడ్డి వాడికి కుంటివాడు సాయం అన్నట్లు నిక్కష్ట జీవితాలు గడుపుతున్న ఆ రెండు కుటుంబాలూ పరస్పరం సహాయం చేసుకుంటూ గడుపుతున్నారు.

రాజు ఇంటికి, పార్వతమ్మ వాళ్ళు ఉంటున్న భాగానికీ మధ్యన వున్న గోడ ఏనాడో కూలిపోయింది. దానిని తిరిగి కట్టించే శక్తి రామనాథశాస్త్రిగారికి లేదు. అయినా కట్టించవలసిన అవసరమూ లేదు. ఎందుకంటే నర్సమ్మ వాళ్ళది మంచి పొరుగు. ఏ పేచీ పూచీ లేదు. చేతనైన సహాయం చేస్తూనే ఉండేవాళ్ళు నర్సమ్మ, రాజులు. గోడ లేకపోవడంవల్ల రాజు ఇంట్లోంచి పార్వతమ్మా, సీతా తిరగడం, వాళ్ళు చేసే పనులూ అన్నీ కనిపిస్తూనే ఉంటాయి. పార్వతమ్మ నెలలో సుమారు ఇరవై రోజులు బయట పనులకు వెళ్తుండేది. చీకటితో వెళ్ళిపోయి బాగా రాత్రి పడ్డాక వస్తుండేది. అటువంటి సమయాల్లో సీత ఒక్కతే ఇంట్లో ఉండేది. అన్ని పనులు అలవాటుగా చేసుకుంటూ పోతుండేది. ఆ పనులు చేస్తున్న తీరు చూస్తుంటే బయటి నుంచి చూసేవారికి ఆమె అంధురాలని ఎంతమాత్రం అనిపించేది కాదు.

రాజు ఆ ఊరిలో ఉన్న బట్టల మిల్‌లో ఫోర్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతనికి చిన్నతనంలోనే తండ్రి పోయాడు. ఆయన తాలూకాఫీసులో హెడ్ గుమాస్తా ఉద్యోగం చేస్తుండేవాడు. ఆయనకి రాచపుండు వచ్చి నలభై దాటకుండానే పోయాడు. ఆయన పోయిన ఓ మూడు వందల డెబ్బది ఐదు రూపాయల పెన్షన్ వస్తుండేది నరసమ్మకి. ఇల్లు ఎలాగూ స్వొంతమే కాబట్టి అందులో కాల క్షేపంచేస్తూ కొడుకుని పెంచుకు వచ్చింది. గుడ్డిలోమెల్ల అన్నట్లు రాజు ఒక్కడే సంతానం కావడంతో రోజులు మరీ అంత ఇబ్బందిగా గడవలేదు. కాని దురదృష్ట వశాత్తూ రాజుకి చదువు అబ్బలేదు. మూలుగుతూ ముక్కుతూ టెన్త్ అయిందనిపించాడు. ఇంక పై చదువుల కోసం ప్రాకులాడడం దండగ అని గ్రహించి ఐటిఐలో టెక్నికల్ కోర్స్‌లో చేరాడు. అది మాత్రం బాగానే పూర్తిచేయగలిగాడు. అదే బట్టల మిల్లులో ఉద్యోగం సంపాదించిపెట్టింది. వచ్చే జీతంతో సొంత ఇంటిలో ఇబ్బంది లేకుండా కాలం గడిచిపోతోంది. నర్సమ్మ రాజుని పెళ్ళిచేసుకో మని నిత్యమూ పోరుతుండేది. "నాకు పెళ్ళెందుకమ్మా...ఇలా హాయిగా ఉండడం నీకు ఇష్టం లేదా ఏమిటి? నాకూ పెళ్ళికీ సరిపడదు" అంటుండేవాడు.

"నీకేం తక్కువరా...నీ వయసు వాళ్ళంతా ఇద్దరు ముగ్గురు పిల్లల తండ్రులు ఎప్పుడో అయ్యారు" అంటుండేది నర్సమ్మ. "నాకేం తక్కువో అమ్మకి ఏం తెలుసు? కాకిపిల్ల కాకికి ముద్దు అన్నట్టు నేను అమ్మకి గొప్పగానే కనిపిస్తాను" అని మనసులో అనుకుంటుండేవాడు. పైకి ఏమి అనేవాడు కాదు. వినీ విననట్లు ఊరుకునేవాడు. ఎప్పుడేనా పోరు ఎక్కువై ప్రాణం విసిగితే

"చూడమ్మా...నువ్వే అంటుంటావుగదా దేవుడు అందరి తలరాతలు పుట్టగానే రాస్తాడని. నాకు రాసిన రాతలో పెళ్ళి గీత వుంటే పెళ్ళికూతురు వెతుక్కుంటూ వస్తుంది. అనవసరంగా నువ్వు బెంగపడి నన్ను బాధపెట్టకు" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయేవాడు. కొడుకు ధోరణి ఏమిటో ఆమెకి అర్థమయ్యేది కాదు. ఇదంతా 'నా తలరాత' అనుకుంటూ కళ్ళనీరు పెట్టుకునేది.

రాజుకి షిఫ్టు డ్యూటీలు ఉంటుండేవి. నైట్ డ్యూటీకి వెళ్ళిన మర్నాడు రోజంతా ఇంట్లోనే ఉండేవాడు. వసారాలో కుర్చీవేసుకుని పత్రిక చదువుకుంటుండేవాడు. ఆ సమయంలో సీత ఇంట్లో పనులు చేసుకుంటూ కనిపిస్తుండేది. ఆ అమ్మాయి ఎంత అలవాటుగా పనులు చేసుకుంటుండేదంటే, దూరం నుంచి చూసేవాళ్ళకి అసలు అంధురాలని అనిపించేది కాదు. గ్రుడ్డి అమ్మాయి అని అంటే నమ్మడం కూడా కష్టం. నిమిషం సేపు ఖాళీగా ఉండేది కాదు. ఏదో పని చేస్తూనే ఉండేది. సీతను చూస్తుంటే రాజు హృదయం ద్రవించిపోతుండేది. అమ్మ చెప్పినట్లు ఆ అమ్మాయి నిజంగా బంగారు బొమ్మ. మెరిసిపోయే పసిమి చాయ నల్లని పొడవు పాటి జుట్టు, చక్కని కనుముక్కు తీరు. కాని ఏం లాభం? అన్నీ వున్నా ఐదోతనం కొరవ అన్నట్లు కళ్ళు మాత్రం లేవు. ఆ లోపం లేకుంటేనా అప్సరస అని చెప్పవచ్చు. పైన కట్నం లేకుండా ఏనాడో పెళ్ళి అయిపోయుండేది. ఎటువంటి వారి జీవితంలోనైనా ఏదో ఒక లోపం పెట్టడం బహుశా ఆ విధాతకి ఉన్న హాబీ కాబోలు.

ఆ రోజు రాజు వసారాలో కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. సీత నెమ్మదిగా పడిపోయిన గోడవైపు వచ్చింది "పిన్నిగారూ..." అంటూ.

నర్సమ్మ లోపల పడుకుని ఉంది.

"అమ్మ పడుకుని ఉంది. ఏం కావాలి?" అని అడిగాడు రాజు.

మగ కంఠం వినిపించేసరికి కంగారుపడింది. ఓ అడుగు వెనకేసింది నెమ్మదిగా "పిన్నిగారు లేరా?" అంది.

"నేను వాళ్ళ అబ్బాయినే. అమ్మకి వంట్లో బాగుండక పడుకుంది. ఏం కావాలో చెప్పండి" అన్నాడు రాజు.

ఈ సందడికి "ఎవర్రా వచ్చింది?" అంటూ వసారాలోకి వచ్చింది నర్సమ్మ.

"నేనండీ...పిన్నిగారూ...సీతని..."

"నువ్వా అమ్మా...ఏమిటి ఇలా వచ్చావు?"

"అమ్మకి బాగా తలనెప్పిగా ఉందండీ. కొంచెం శొంఠి గంధం వేస్తే తగ్గుతుంది. మా ఇంట్లోనూ శొంఠి లేదు. మా ఇంటివారి దగ్గరా లేదు. మీ దగ్గరుంటే ఒక్క కొమ్ము ఇవ్వండి" అంది.

"ఉంటుందమ్మా. కొంచెం వెతకాలి. నువ్వెళ్ళు. నేను చూసి గంధం అరగదీసి తీసుకు వస్తాను."

"మీకు శ్రమ ఎందుకు పిన్నిగారూ...శొంఠి కనిపిస్తే ఓ కేకేయండి. నేను మళ్ళీ వచ్చి తీసుకు వెళ్తాను."

"ఇందులో శ్రమ ఏముందమ్మా. ఇరుగు పొరుగు అన్నాక ఆమాత్రం సహాయం చేసుకోకపోతే ఎలా? నువ్వెళ్ళు. నేను తీసుకు వస్తాను"

"అలాగే పిన్నిగారూ...నేను వెళ్ళొస్తాను."

సీత వెళ్ళగానే బరువుగా నిట్టూర్చింది నర్సమ్మ




## మీ(మా) సౌకర్యం

ఒకసారి ఓ కాలేజీ వార్షికోత్సవం జరుగుతోంది. సభలో ప్రిన్సిపాల్‌గారు మాట్లాడుతూ "నాకు ఇంగ్లీషులో మాట్లాడడమే అలవాటు. కానీ మీ అందరి సౌకర్యం కోసం ఈ రోజు తెలుగులో మాట్లాడతాను" అని అన్నారుట.

అదే కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న విశ్వనాథవారు మధ్యలో కలగజేసుకుని "మా సౌకర్యం కోసం వద్దులెండి–మీ సౌకర్యం కోసమే మాట్లాడండి. అదీనూ తప్పులు లేకుండా" అని ఓ చురక వేశారు.

సేకరణ: సిహెచ్. లక్ష్మి

## ఇంకా కురవండి...


బ్రిడ్‌లింగ్టన్‌లోని ఒక సమావేశంలో మెక్‌నమారా ఉపన్యాసం ఇస్తూ వుండగా కుంభ వర్షం కురవసాగింది. కొంతసేపు గడిచిన తర్వాత మెక్ నమారా అన్నాడు.

"మిమ్మల్ని చాలాసేపు కూర్చోపెట్టాను. అందుకు నాకు బాధగా వుంది."

అంతలో ఎవరో బిగ్గరగా అన్నారు– "మీరు అలాగే మాట్లాడుతూ వుండండి సార్! వర్షం ఇంకా కురుస్తూనే వుంది."

– దావులూరి సురేంద్రనాధ్






"గుడ్డిదన్న మాటేకాని అన్ని పనులూ చేస్తుంది. వంట కూడా చక్కగా చేస్తుంది. ఇంత అందమైన పిల్లని దేవుడు ఇంత చిన్నమావు చూపి చూపు లేకుండా ఎందుకు చేశాడో" అని బాధపడింది.

"గ్రుడ్డివాళ్ళకి ఇతరులకంటే ఏదో ఒక జ్ఞానేంద్రియం మరింత బాగా పనిచేస్తుం దని అంటారు. ఆ విధంగా ఈ అమ్మాయి కూడా ఏ ఇబ్బందీ లేకుండా పనులు చేసుకుంటుందేమో" అన్నాడు రాజా.

"కావచ్చు. నిజానికి ఈ పిల్లకి కల్యాణయోగం వుందో లేదో తెలియదు. కాని పెళ్ళి అయితే మాత్రం అత్తవారింట్లో దీపమై వెలుగుతుంది. తన క్రింద నీడ వున్నా అందరికీ వెలుగును పంచి ఇచ్చే దీపంలాగా తనకి చూపు లేకపోయినా అందరికీ కాంతినిస్తుంది" అంది నర్సమ్మ కవితాధోరణిలో.

"నాకూ అలాగే అనిపిస్తోంది. నీ నోటి వాక్యాన ఆమె ఓ మంచి ఇంట్లో ఇల్లాలుగా అడుగుపెట్టే అంతేచాలు."

"సర్లే మనం మాట్లాడుకుంటూ కూర్చుంటే సమయం గడిచిపోతుంది. పాపం పార్వతమ్మ ఎంత బాధపడ్తుందో ఏమో! వాళ్ళు తమ బాధల్ని తమ కడుపులోనే దాచుకుంటారు కాని నోరు విప్పి ఎవరితోనూ చెప్పకోరు. ఎంత బాధపడ్తుంటే వచ్చి అడిగిందో సీత శొంఠి కావాలని. వెతికి చూసి గంధం తీసి ఇచ్చివస్తా."

"ఎక్కడ పెట్టావో జ్ఞాపకం లేకపోతే పర్వాలేదులే అమ్మా. కావాలంటే నేను కొనుక్కు వస్తా."

"నువ్వు కొనుక్కు వచ్చేలోపల నాకే కనిపిస్తుంది" అంటూ లోపలికి వెళ్ళింది నర్సమ్మ.

కొంచెం సేపట్లో శొంఠి గంధం తీసి ఇచ్చి వచ్చింది నర్సమ్మ.

"పాపం రాత్రి మంచీ వళ్ళు తెలియని జ్వరంట పార్వతమ్మకి. సీత కషాయం కాచి ఇచ్చింది. జ్వరం ఇప్పుడు తగ్గింది కాని బాగా తలనెప్పిగా వుందట. శొంఠి పట్టు వేశాగా... తగ్గిపోతుంది" అంది.

"ఎవరేనా డాక్టర్‌కి చూపిస్తే బాగుంటుందేమో!"

"అంత స్థోమత వుండొద్దా బాబూ... అటువంటి వాళ్ళు అలవాటైన ఇంటి వైద్యాలనే చేసుకొంటారు."

"అది సరేకాని. నీకో మాట చెప్పనా అమ్మా"

"ఏమిట్రా అది. చెప్పడానికి మొహమాట పడ్తావెందుకు?"

"నువ్వేమనుకుంటావోనని."

"అఘోరించినట్లుంది. నేననుకోవడం ఏమిట్రా! డొంక తిరుగుడు మాని సూటిగా చెప్ప"

"నేను చెప్పేది ఏమైనా నువ్వేం చెప్తే అదే చేస్తాను. నువ్వు మనసు పాడుచేసు కోనక్కరలేదు."

"ఏమిట్రా ఈ పైత్యం వాగుడు? అర్థమయ్యేట్టు చెప్ప"

"నువ్వు ఇన్నాళ్ళూ కోడలు కావాలని కోరుకుంటున్నావు కదా!"

"అవును. కొంపతీసి నువ్వు సీతను చేసుకోవాలనుకోవడం లేదు కదా!"

"అదుగో... నీకు కోపం వచ్చింది. నీకు ఇష్టం లేకపోతే వద్దు."

"మాటవరసకి అన్నానా. సీత మీద నీ మనసు మళ్ళిందా! నిజంగానా?"

"అవునమ్మా.. ఇన్నాళ్ళూ లేనిది ఇప్పుడు సీతను చూశాక పెళ్ళి చేసుకోవాలన్న కోరిక కలిగింది."

"పెళ్ళి అనేది బాగా ఆలోచించుకుని నిర్ణయించుకోవలసిన విషయం. తొందర పాటు అయితే తర్వాత బాధపడవలసి రావచ్చు."

"లేదమ్మా బాగా ఆలోచించుకున్నాను. నువ్వే అన్నావుగా... చూపు లేదన్న మాట తప్పిస్తే ఆ అమ్మాయి అత్తవారింట వెలుగులు పండిస్తుందని. నాకూ అలానే అనిపించింది."

"చూడు బాబూ... పుస్తకాలు చదివీ, సినిమాలు చూసీ నువ్వేవో త్యాగాలు చేయాలనుకోకు. అవి కల్పన. ఇది జీవితం."

"ఇందులో త్యాగం లేదమ్మా... ఒక విధంగా స్వార్థం. అది సరే. ఇది జరిగితే ముగ్గురి సమస్యలు తీరుతాయి. కూతురి పెళ్ళయిందన్న తృప్తి పార్వతమ్మగా రికి కలుగుతుంది. మంచి కోడలు వచ్చిందన్న సంతోషం నీకు కలుగుతుంది. అందమైన, గుణవంతురాలైన భార్య వచ్చిందన్న ఆనందం నాకు మిగులుతుంది. అయినా ఈ రోజుల్లో గుడ్డివాళ్ళకి ఎందరికో చూపు తెప్పిస్తున్నారు. అదృష్టం బాగుంటే ఆ అమ్మాయికే చూపు రావచ్చు. ఎవరు చెప్పగలరు? స్థోమత లేక ఇన్నాళ్ళూ వాళ్ళు ఆ ప్రయత్నాలు చేయకపోయి వుండవచ్చు. మనం చేద్దాం."

నర్సమ్మ కొంచెంసేపు ఆలోచించింది.

"అంతా బాగానే వుంది కాని నీకు ఏం తక్కువరా? ఏరికోరి గుడ్డి పిల్లని చేసుకోడానికి?"

"పేరుకి గుడ్డిదేకాని ఆ అమ్మాయికి ఏం తక్కువమ్మా. తల్లి బయటకి వెళ్ళి నప్పుడు ఇంట్లో పనులన్నీ తనే చేసుకోవడం లేదూ? మనింటికి వచ్చాక నువ్వు తోడు వుండనే వుంటావు. ఇంక ఇబ్బందేముంది?"

"నేను ఎన్నాళ్ళుంటానురా... ఊరు పొమ్మంటోంది. కాడు రమ్మంటోంది."

"అలా అనకు. నీవు క్షేమంగా వుండగానే నీ కోడలికి చూపు రావచ్చు."

"సరే నీ ఇష్టం. నేను వెళ్ళి సూటిగా వాళ్ళని అడక్కుండా రామనాథశాస్త్రిగారి చెవిన ఈ విషయం వేస్తాను. ఆయనే ఇద్దరికీ మధ్యవర్తిత్వం చేస్తాడు."

"మనమేదో వాళ్ళ పరిస్థితి చూసి జాలిపడి చేసుకుంటున్నామన్న అభిప్రాయం వాళ్ళకి రానీకు. అమ్మాయి నచ్చినందునే ఇష్టపడి చేసుకుంటున్నామని చెప్ప, వాళ్ళకి ఏ కారణం చేతనైనా ఎటువంటి అభ్యంతరం వున్నా స్పష్టంగా చెప్పేయమను. బలవంతం ఏమీ లేదని మరీ మరీ చెప్ప"

"పిచ్చి నాయనా... ఇవన్నీ నాకు తెలియవట్రా. వాళ్ళకి అభ్యంతరం ఏదీ వుండాల్సిన అవసరం లేదు. వాళ్ళ శాఖ, మన శాఖ కూడా ఒక్కటే. ఆ పట్టింపు కూడా వుండదు. ఇంకేదైనా ఆక్షేపణ వుంటే అది వాళ్ళ దురదృష్టం. నేను సాయంత్రం ఓసారి పార్వతమ్మని చూడడానికి వెళ్ళినట్లుగా వెళ్ళి శాస్త్రిగారితో ఈ విషయం కదలేస్తా."

తల్లి సులువుగానే ఒప్పుకున్నందుకు ఎంతగానో ఆనందించాడు రాజా.

మరో నెల రోజుల్లో రాజాకి, సీతకి పెళ్ళి అయిపోయింది. అదృష్టం ఇలా కలిసివస్తుందని సీతకాని, పార్వతమ్మకాని కలలో కూడా ఊహించలేదు. చూస్తూ చూస్తూ చిల్లి గవ్వలేని గుడ్డిదాన్ని చేసుకున్నాడేమిటి అని కొంతమంది "పరహి తులు" చెవులు కొరుక్కున్నా పైకి మాత్రం అనలేదు. అవి తెలిసి నవ్వుకున్నారు రాజా, నర్సమ్మలు.

కాలం సాఫీగా, సంతోషంగా గడిచిపోతోంది. కూతురి బరువు దిగడంతో మరింత ఓపిక వచ్చి ఇంకా ఎక్కువ పనిచేసి వున్నదాంట్లోనే కూతురికి, అల్లుడికి అచ్చటా ముచ్చటా తీరుస్తోంది పార్వతమ్మ.

మూడు నెలలు గడిచింది. యాత్ర స్పెషల్ ఒకటి సంపూర్ణ దక్షిణ దేశ యాత్ర లకు బయలుదేరుతోంది. జీవితంలో ఎప్పుడూ కష్టాలేకాని సుఖం అంటూ ఎరుగరు – ఈ చివరి దినాల్లోనైనా వాళ్ళ చేత తీర్థయాత్రలు చేయించాలన్న ఆలోచన కలిగింది రాజాకి. వాళ్ళు వద్దంటున్నా వినకుండా తల్లిని, అత్తగారినీ ఆ యాత్రాస్పెషల్‌లో పంపించాడు. యాత్రలన్నీ పూర్తి అయ్యాయి. టూరిస్టు బస్ తిరుగుప్రయాణంలో వుంది. ఆ రాత్రి విపరీతమైన వర్షం. బస్ ఘాట్ రోడ్ మీద వెళ్తోంది. తరువాయి మజిలీ చేరాలంటే కనీసం గంట పడుతుంది. దారిలో

బస్‌ని ఆపడానికీ లేదు. బస్‌ని నెమ్మదిగా, జాగ్రత్తగా తీసుకువెళ్తున్నాడు డ్రైవర్. ఒక చోట దారి మరీ ఇరుకుగా వుంది. ఆ సమయంలో ఎదుటి నుంచి మరో కారు వస్తోంది. దానికి దారి ఇయ్యడానికి బస్‌ని అంచుకు తీసుకువెళ్ళాడు డ్రైవర్. అక్కడ నేల బాగా జారుడుగా వుండడంతో బస్ జారిపోయి క్రింద లోయలోకి పడిపోయింది. అంతే, బస్‌లోని డెబ్భైమందిలో ఇరవై ఆరుమంది అక్కడిక క్కడే ప్రాణాలు విడిచారు. వారిలో సర్వమ్మ, పార్వతమ్మలు కూడా వున్నారు. ఆ తీర్థయాత్రే వారి జీవి యాత్రలో చివరి యాత్ర అయింది.

షాక్ నుంచి తేరుకోడానికి చాలా నెలలే పట్టింది రాజుకీ, సీతకీ. మరికొన్ని నెలల తర్వాత తిరిగి మామూలు మనుషులయ్యారు.

ఆ ఊరిలో ఐ స్పెషలిస్టులు కాంప్ ఏర్పాటుచేశారు. వారు దృష్టి దోషం వున్న వారిని పరీక్షించి తగు వైద్యం చేస్తారు. సలహాలు ఇస్తారు. అంధుల్ని పరీక్షించి వారిలో తిరిగి ఎవరికి చూపు రాగలదో నిర్ణయిస్తారు. వారికి అవసరమైన ఆపరే షన్‌లు కూడా చేస్తారు. ఈ కాంప్‌ని ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తుండడం వల్ల పేదవారికి ఎంతటి ఖరీదు అయిన ఆపరేషన్‌ను అయినా ఉచితంగా చేసే వీలు కల్పించారు.

స్నేహితుల ప్రోద్భలం మీద సీతని ఆ కాంప్‌కి తీసుకువెళ్ళాడు రాజు. డాక్టర్ మోడి సీతను పరీక్షించాడు. ఆమెది మధ్యలో వచ్చిన అంధత్వం అని తెలుసు కున్నాడు. ఆమెకి చూపు వచ్చే అవకాశం వుందనీ, అయితే మరికొన్ని పరీక్షలు చేశాకనే ఖాయంగా చెప్పగలననీ, అందుకు హైదరాబాద్ వచ్చి తనని కలియమని చెప్పారు ఆయన.

సీత హైదరాబాద్ వెళ్ళడానికి ఒప్పుకోలేదు. "ఎందుకండీ, ఇప్పుడు మనకి ఈ ఖర్చు. కనిపించకుండా బోలెడు అవుతుంది. అంత మనం ఎక్కడ తట్టుకోగలం! అయినా ఇప్పుడు నాకేమి ఇబ్బందిగా వుంది చెప్పండి" అంటూ రానని పట్టుబట్టింది.

అయినా రాజు బలవంతపెట్టి నెల తర్వాత సీతను హైదరాబాద్ తీసుకువె ళ్ళాడు. డాక్టర్ మోడిని కలిశాడు. ఆయన సీతను రెండు రోజులు అబ్జర్వేషన్‌లో వుంచాడు. మూడవ రోజున "ఐయామ్ సారీ మిస్టర్ రాజు. ఈమెకి చూపురాదు. తీసుకురావాలని ప్రయత్నిస్తే బ్రెయిన్ ఎఫెక్టు అయ్యే ప్రమాదం వుంది" అని వివారంగా చెప్పాడు.

రాజు దిగులుపడిపోయాడు. తేరుకున్నాక "మా అదృష్టం ఇలా వుంటే మీరేం చేస్తారు?" అన్నాడు.

సీత అక్కడేమీ మాట్లాడలేదు.

ఇంటికొచ్చాక "మీరేమీ బాధపడకండి. ఇదీ మంచికే" అంది.

"అలా అంటే ఎలా? ఈయనొక్కడేనా ఏమిటి డాక్టర్? ఇంకెవరికైనా చూపిద్దాం" అన్నాడు రాజు.

"ఈయన దేశంలోనే ప్రముఖ నేత్ర వైద్యుడు. ఇంతకు మించి ఎవరు మాత్రం ఏమి చేస్తారు?" అంది సీత.

"అదేం కాదు. నువ్వు ఊరుకో. వేరే డాక్టరుకి చూపిద్దాం" అన్నాడు రాజు.

సీత ఏమీ మాట్లాడలేదు.

కాలం గడిచిపోతోంది కాని సీతని మళ్ళీ ఏ డాక్టర్ దగ్గరకీ తీసుకువెళ్ళడం జరగలేదు. పండంటి ముగ్గురు బిడ్డలు పుట్టడం, వాళ్ళు పెద్దవాళ్ళు కావడం కూడా జరిగింది.

సీత ఏబయ్యోపడికి చేరువవుతోంది.

ఆ ఊరిలో మళ్ళీ నేత్ర వైద్యుల శిబిరం వెలిసింది. ఫారిన్ రిటర్న్ డాక్టర్లు కార్నియాగ్రాఫ్టింగ్‌లో స్పెషలిస్టులూ ఎందరో వచ్చారు.

"సీతా... డాక్టర్లని కలుద్దామా. అప్పుడు నీకు చూపు రాదన్నారు కాని ఇప్పటి విజ్ఞానంతో వస్తుందంటారేమో!" అన్నాడు రాజు.

సీతముఖంలో నిర్లిప్తమైన చిరునవ్వు చోటు చేసుకుంది.

"చూపు కావాలనుకుంటే ఆనాడే ఒప్పుకునేదానిని. అప్పుడు వద్దనుకున్న దానిని ఇప్పుడు కావాలనుకుంటానా?" అంది.

"అదేమిటి వద్దనుకోవడం ఏమిటి? నీకు చూపు రాదని డాక్టర్ మోడిగారే కదా చెప్పింది?"

"ఆయన ముందు ఏమన్నారు?"

"నీకు చూపు వస్తుందన్నారు!"

"ఆ తర్వాత రాదని ఎందుకు అన్నారు?"

"పూర్తి పరీక్షలు చేశాక రాదన్న అభిప్రాయానికి వచ్చారు."

"అది అబద్ధమని మీకూ తెలుసు, నాకూ తెలుసు"

"అంటే"

"డాక్టర్ మోడి నాకు అంతా చెప్పారు. ముందు మీరు మనస్ఫూర్తిగా నాకు చూపు తెప్పించాలనుకున్నారు. కాని తర్వాత ఆ ఆలోచన మారింది. మనం హైదరాబాద్ వెళ్ళాక మీరు ఆయన్ని ఒంటరిగా కలుసుకున్నారు. నేను ఎంతో అందమైన దానినని, నాకు కనక చూపువస్తే నేను మీ వికృత రూపాన్ని భరించలేననీ, మిమ్మల్ని వదిలేసి వెళ్ళిపోతాననీ, కాపురం సర్వనాశనం అయిపోతుందనీ గోలపెట్టారు. అందుకే నాకు చూపు రాదని చెప్పమని ఆయన్ని ప్రాధేయపడ్డారు. అవునా?"

రాజు ఏమీ మాట్లాడలేదు.


"డాక్టర్ మోడి అందుకు ఒప్పుకోలేదు. అబద్ధం చెప్పడం తన వృత్తికే కళంకం అని మిమ్మల్ని చీవాట్లు పెట్టారు."

"కాని ఆయనేగా నీకు చూపు రాదని చెప్పింది."

"నిజమే. నేను కోరినమీదటే ఆయన అలా చెప్పారు. మీది పరమ వికారమైన రూపం అని నాకు తెలుసు. మా అమ్మ బాధపడుతుండేది "ఆ అబ్బాయిది బంగారం వంటి గుణమమ్మా. కాని రూపం మాత్రం రోత" అని. రామనాథశాస్త్రి గారువాళ్ళూ కూడా మీ పట్ల జాలిపడుతుండేవారు."

"మరి అలాంటప్పుడు నిన్ను నా కిచ్చి ఎందుకు పెళ్ళిచేసింది మీ అమ్మ?"

"చూడండి. నాలో అంధత్వం వుంది. ఆ ఒక్క లోపం తప్పిస్తే నేను బంగారు బొమ్మ అని మీరందరూ అనుకున్నారు. మీలో వున్న లోపం వికృత రూపం. ఆ ఒక్కటి తప్పిస్తే మీరూ బంగారం అని అందరూ అంటారు. ఎంచి చూస్తే ఏదో లోపం లేనిదెవరికి? మీ అంతట మీరు పెళ్ళి ప్రతిపాదన చేయడం దేవుని వరంగా అమ్మకి అనిపించింది. తానుగా మంచి సంబంధాన్ని ఎందుకు వదులుకోవాలి? అని మనసుని సమాధానపరచుకుంది. అలా అని తన ఇష్టాన్ని నా నెత్తిన రుద్ద లేదు. విషయమంతా నాతో చెప్పింది. మీరు ఎంత వికారంగా వుంటారో కూడా నాతో చెప్పింది. అయినా నేను ఒప్పుకున్నాను. ఎందుకంటే ఇందులో నాకూ స్వార్థం వుంది. మామూలుగా అయితే నేను కన్యగానే వుండిపోవాలని నిశ్చయించుకు న్నాను. అమ్మ ఉన్నంతకాలం పర్వాలేదు. కాని ఆ తర్వాత? గుడ్డిదాన్నైన నన్ను ఎవరు చూస్తారు? తల్లీ, చెల్లీ, కూతురూ తేడా కూడా లేని కామాంధులున్న ఈ సమాజంలో నన్ను పాడుచేయకుండా వుంటారా? కుక్కలు చింపిన విస్తరిలాంటి అటువంటి జీవితం గడిపే బదులు కేవలం వికారం అన్న కారణాన్ని ఆవతలపెట్టి మిమ్మల్ని వివాహమాడితే నా జీవితంలో ఎంత మంచి మలుపు వస్తుంది? మీ వికార రూపం గురించి వినడమేకాని చూడలేదు. చూడని మనిషి రూపం ఎలా వున్నా చూడనంతకాలం ఆయనతో కాపురం చేయడంలో ఇబ్బంది లేదు."



"మరి నాతో అడ్జస్టు కాగలవనుకున్న దానివి కంటి చూపు తెచ్చుకోడానికి ఎందుకు ఒప్పుకోలేదు"

"అది నా స్వార్థం. నేనూ మామూలు మనిషినే. అందరిలోనూ ఉండే బలహీనతలు నాలోనూ వుంటాయి. నాకు దృష్టి వచ్చిందనుకోండి. నిజానికి మీ వికార రూపాన్ని భరించలేకపోవచ్చు. అలా అని మీరు భయపడినట్లు మిమ్మల్ని వదిలేసి ఎవరితోనో లేచిపోకపోవచ్చు. కాని మీతో కాపురం చేయలేనేమో అన్న భయం వేసింది. ఇష్టంలేని కాపురం చేస్తుంటే ఆ ఇంట్లో సుఖశాంతులు వుండవు. దేవుడిలాంటి మీ మనస్సుకి శాంతి లేకుండా చేసినదాన్ని అవుతాను. నన్ను ఉద్ధరించి పుణ్యం కట్టుకున్న మీకు ద్రోహం చేసినదానిని అవుతాను. చూపు రావడం వల్ల ఇన్ని అనర్థాలు వచ్చే అవకాశం వున్నప్పుడు, ఆ అవకాశానికి తావు ఇవ్వకుండా అంధురాలిగానే వుండిపోవడం మంచిది కాదూ? ఈ విషయాలన్నీ విన్నాక మోడీగారు ఒప్పుకున్నారు. అప్పుడే మీ సంగతి చెప్పారు. 'మీ ఇద్దరూ వారి వారి కారణాల వల్ల నువ్వు అంధురాలుగానే వుండాలనుకుంటుంటే కాదనడానికి నేనెవరిని?' అన్నారు. అందుకే నాకు చూపురాదని, మన ఇద్దరి ముందూ చెప్పారు."

"నాలో ఇంత స్వార్థం వుందని తెలిసి కూడా నాతో ఇంతకాలం ఎలా కాపురం చేయగలిగావు సీతా?"

"స్వార్థం ఇతరులకి చెడు చేసినప్పుడే అది నింద్యం అవుతుంది. ఎవరి స్వార్థం వారు చూసుకోవడంలో తప్పలేదు. అది ఇతరులకి ఇబ్బంది కలిగించనంతకాలం. నా స్వార్థం అంతే కదా! మీకు ఇబ్బంది కలిగించకుండా నాకు ప్రయోజనం కల్పించింది. నిజానికి మీ స్వార్థం తెలుసుకున్నాక అది నాకు మీపై గౌరవాన్ని పెంచింది. మీ స్వార్థం ప్రయోజనం మన కుటుంబ జీవితం సాఫీగా సాగడం. అటువంటప్పుడు నా దృష్టి వల్ల కలతలు వచ్చే అవకాశాన్ని కల్పించుకోవడం ఎందుకు?"

"నీది ఎంతటి ఉన్నత మనస్తత్వం సీతా. డాక్టర్ మోడీ నీకు చూపు రాదని చెప్పాక కూడా నిన్ను వేరే డాక్టర్‌కు చూపిస్తానని కావాలని ప్రగల్భాలు పలికాను. అంటే నేను నీ పట్ల శ్రద్ధతో వున్నానని నమ్మించడానికి. అప్పుడూ నువ్వు బయటపడలేదు. నన్ను బయటపెట్టలేదు"

"ఆ విషయం నాకు తెలుసు. అందుకే నేనూ ఆ విషయం మళ్ళీ ఎత్తలేదు. మిమ్మల్ని బయటపెట్టి వద్దనుకున్న కలతల్ని తెచ్చుకుంటానా?"

"సరే. గతం గతః. ఇన్నాళ్ళూ మన మనస్సులలో దాక్కుని వున్న రహస్యాలు ఇప్పుడు బయటపడడంతో నా మనసు ఎంతో తేలిగ్గా వుంది. నాకు చాలా ఆనందంగా వుంది. ఈ వయసులో నువ్వు నా వికార రూపం చూసి నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోతావన్న భయం నాకు లేదు. నాతో కాపురం చేయలేకపోయినా దిగులుపడను. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. అంతా నీ పోలికే. చక్కని రూపాలు, బుద్ధులు వచ్చాయి. ఇప్పుడు చూపు తెచ్చుకుంటే వాళ్ళని చూసి ఆనందించవచ్చుగా. నా మాట విని డాక్టర్ దగ్గరికి వెళ్దాం పద"

"చూడండి. మిమ్మల్ని గురించి – అంటే వినినటువంటి మీవికార రూపం గురించి కాదు – మీ ఔన్నత్యం గురించి నేను ఊహించుకున్న రూపం చాలా అందమైనది. దానిని నేను మాటలలో వర్ణించలేను. నా దృష్టిలో – అదే మనో దృష్టిలో దేవునికి కూడా అంతటి గొప్ప రూపం లేదు. ఆ రూపాన్ని అలాగే వుండిపోనీండి. తెల్లని గోడ మీద చిన్న నల్ల చుక్క వున్నా అది ఆ రూపాన్ని పాడుచేస్తుంది. నా మనసులోని మీ మనోరూపానికి మచ్చ తెచ్చే అవకాశం కల్పించదలచుకోలేదు. మీ రూపాన్ని చెరిగిపోకుండా, నా మనసులో అలాగే వుండిపోనీండి" అంది సీత తాదాత్మ్యంలో అరమోడ్పుగా మూసుకున్న కన్నులతో.

రాజా ఏమీ మాట్లాడలేక మౌనంగా వుండిపోయాడు. అప్పటివరకూ అతనికి సీత బాహ్య సౌందర్యమే కళ్ళ ముందు మెదులుతూ వచ్చింది. ఆ క్షణంలో ఆమె వ్యక్తిత్వం హిమాలయాలకన్నా ఉన్నతంగా అనిపించింది. ఆమె రూపం దేవ పారిజాతాల కన్నా మించిన అందం, స్వచ్ఛత కలిగినదనిపించింది. వర్ణనాతీతమైన ఆ రూపం అతని మనో నయనాల ముందు సాక్షాత్కరించింది. ◆


FRIENDLY INSTITUTION WITH DYNAMIC VISION

MAITRIKRISHNA
FINANCE LIMITED

PROVIDES INTEGRATED PACKAGE OF FINANCIAL SERVICES

- DEPOSITS
- HIRE - PURCHASE
- LEASING
- BILL DISCOUNTING
- HOUSING FINANCE
- CAR FINANCE
- LOAN SYNDICATION
- MERCHANT BANKING SERVICES
- PROJECT CONSULTANCY
- MANAGEMENT CONSULTANCY
- PORTFOLIO MANAGEMENT
- FACTORING
- INDUSTRIAL TURN - KEY SERVICES
- TURN - AROUND STRATEGIES

CHAIRMAN: CHERUKURI KRISHNA PRASAD
Managing Director: GANTA APPALA NAIDU

CORPORATE OFFICE: ANURATNA COMMERCIAL COMPLEX, 5TH FLOOR, DWARAKANAGAR, VISAKHAPATNAM - 530 016, PHONES: 540522, 540566.